క్లుప్తంగా

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోమవారం ఆర్మూర్ డివిజన్ మాల మహానాడు ఆధ్వర్యంలో తెలంగాణ దళిత ఉద్యమ పితామహుడు భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాల మహానాడు ఆర్మూర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, మాదరి రాజన్న, మూగ ప్రభాకర్, నాయకులు, పింజ బోజన్న, నారాయణ, పులి గంగాధర్, కొంతం మురళి, అశోక్ పాల్గొన్నారు.

స్నేహితుడికి కొండంత అండ



పెర్కిట్(ఆర్మూర్): అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మిత్రుడికి అండగా నిలిచారు తోటి స్నేహితులు. మామిడిపల్లి గ్రామానికి చెందిన మున్సిపల్ ఉద్యోగి నరేష్ అనారోగ్యం పాలై విషమ పరిస్థితిలో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. చికిత్సకు రూ.లక్షల్లో ఖర్చు అవుతుండటంతో పదో తరగతి వరకు నరేష్‌తో కలిసి చదువుకున్న మిత్రులు తామున్నామంటూ ముందుకు వచ్చారు. అందరు కలిసి రూ.లక్షా1,500 సేకరించి సోమవారం నరేష్ తల్లికి అందజేశారు. మల్యాల నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఆర్మూర్‌టౌన్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ ఏసీపీ కార్యాలయం ఆవరణలో సోమ వారం సామాజిక సేవకుడు పట్వారీ తులసి కుమార్ పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ చాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, కాలనీల్లో మొక్కలు నాటి కాలుష్య నివారణకు, జీవవైవిధ్యానికి తోడ్పడాలన్నారు. పోలీస్ సిబ్బంది శేఖర్, ఫారుఖ్ పాల్గొన్నారు.

బాధితులకు వరం సీఎంఆర్‌ఎఫ్

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆపదలో మెరుగైన వైద్యం చేయించుకోలేని బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడిసెరం భూమేశ్ రెడ్డి అన్నారు. సోమవారం నూత్‌పల్లి, గంగా సముందర్ గ్రామాల్లో బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. షేక్ తరానాకు రూ.60వేలు, ముప్ప కృష్ణ ప్రసాద్‌కు రూ.20 వేలు మంజూరైనట్లు తెలిపారు. నాయకులు భోజారెడ్డి, సుమన్ నాయక్, చిన్నారెడ్డి, కిరణ్, సంజీవ్, సాయన్న, శ్రీకాంత్ ఉన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

పెర్కిట్(ఆర్మూర్): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ సూచించారు. పెర్కిట్‌లో సోమవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామ అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పక్కా ప్రణాళిక ప్రకారం రాబోయే విద్యా సంవత్సరంలో 10 నుంచి 20 శాతం విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలన్నారు.

పంటల పరిశీలన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో ముందస్తు వర్షాలకు దెబ్బతిన్న సజ్జ పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి(ఏవో) అన్నం హరికృష్ణ సోమవారం పరిశీలించారు.ఏఈవో నిషికాంత్, రైతులు అల్లం నరేష్, ఇజాప్, రాజమల్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బోధన్ టౌన్ (బోధన్): బోధన్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వర్ని మండల కేంద్రానికి చెందిన రుక్మిణి (55) మృతి చెందింది. అనారోగ్యంతో బాధపడుతున్న రుక్మిణిని కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్స అందిస్తుండగా షుగర్ లెవల్స్ పెరిగి గుండెపోటుతో మృతి చెందినట్లు ఆర్‌ఎంవో డాక్టర్ రహీం తెలిపారు.

కుక్కల దాడిలో జింక..

రుద్రూర్ : కోటగిరి మండలం యాద్‌గార్‌పూర్ గ్రామ శివారులో సోమవారం కుక్కల దాడిలో జింక మృతి చెందింది. పంట పొలాల్లో జింక పిల్లను కుక్కలు వెంటాడుతుండగా గమనించిన రైతు కుక్కలను తరిమికొట్టి గ్రామస్తులకు సమాచారం అందించారు. తీవ్రగాయాలైన జింకను గ్రామంలోకి తీసుకువచ్చి అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ సెక్షన్ అధికారి సురేశ్ గాయాలతో ఉన్న జింకను కోటగిరి వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా మృతి చెందింది.

దుకాణంలో చోరీ

ఎడపల్లి(బోధన్): జానకంపేట గ్రామ శివారు నితిన్ పేపర్ ప్లేట్స్ దుకాణ సముదాయంలో సోమవారం తెల్లవారుజామున దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించి అందినంత దోచుకెళ్లారు. సుమారు 2.20 నిమిషాల ప్రాంతంలో దుకాణం షట్టర్‌ను ధ్వంసం చేసి లోపలికి చొరబడిన ముగ్గురు దొంగలు కౌంటర్‌లో ఉన్న నగదుతోపాటు సుమారు 50 వేల సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని ఎడపల్లి పోలీసులు పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కుబడిగా పొలం బాట

- నిర్లక్ష్య ధోరణిలో విద్యుత్ శాఖాధికారులు
- పలు చోట్ల కరెంటు షాక్ తగిలి ప్రాణాలు కోల్పోతున్న మూగజీవాలు



పెర్కిట్‌లో విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదెలు(ఫైల్)

పెర్కిట్(ఆర్మూర్): వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ ప్రమాదాల నివారణకు, సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పొలంబాట కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌లో ఆదివారం సాయంత్రం భూమికి సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి మేతకు వెళ్లిన నాలుగు గేదేలు మృతి చెందడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. దీంతో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతు కుటుంబం రోడ్డున పడ్డది. ఒక్కో గేదె ఖరీదు రూ.లక్షా 20 వేల వరకు ఉంటుంది. నాలుగు గేదెలు మృతిచెందడంతో సుమారు రూ. 4 లక్షల 80 వేలు నష్టం కలిగింది. దీంతో రైతు కుటుంబానికి పూడ్చలేని నష్టం వాటిల్లింది.

పర్యవేక్షణ కొరవడటంతోనే..

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగానే మూగ జీవాలు విద్యుదాఘాతానికి గురువుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పొలంబాట కార్యక్రమంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు గుర్తించడంలో విఫలమవుతున్నారడానికి జరుగుతున్న ఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. గత సంవత్సరం వర్షాకాలంలో ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో విద్యుత్ తీగలు తగిలి రెండు గేదెలు, పట్టణంలోని యానంగుట్ట సమీపంలో రెండు గేదెలు మృతి చెందాయి. ప్రమాదానికి బాధ్యత వహించాల్సిన విద్యుత్ శాఖ అధికారులు డొంకతిరుడుగు సమాధానాలు చెబుతూ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. నాలుగు గేదెల మృతి తర్వాతైనా అధికారులు తేరుకుని రాబోయే వర్షాకాలంలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తీవ్ర నష్టం జరిగింది



పాడి పరిశ్రమపైనే ఆధారపడ్డ మాకు గేదెల మృతితో తీవ్ర నష్టం జరిగింది. సుమారు రూ.4లక్షల 80 వేల వరకు నష్టం కలిగింది. నష్ట పరిహారం విషయంలో ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత రావడం లేదు. – జనార్దన్ గౌడ్, పాడి రైతు, కొటార్మూర్

పాత నేతలకే కాంగ్రెస్‌లో పదవులు

- పీసీసీ జిల్లా పరిశీలకుడు బల్మూరి వెంకట్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

బాల్కొండ/మోర్తాడ్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న వారికే పదవులు దక్కుతాయని ఎమ్మెల్సీ, పీసీసీ జిల్లా పరిశీలకుడు బల్మూరి వెంకట్ అన్నారు. సోమవారం ముప్కాల్, మోర్తాడ్, భీంగల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో కొత్తగా చేరిన వారికి కూడ సముచిత స్థానాలు ఇవ్వడానికి పార్టీ నాయకత్వం పరిశీలిస్తుందన్నారు. గ్రామ శాఖ, మండల శాఖ అధ్యక్షుల ఎన్నికల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేలా ఐక్యంగా పని చేయాలన్నారు. ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, రాష్ట్ర కో–ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ అధికారి ప్రతినిధి వేణుగోపాల్, ఏఎంసీ చైర్మన్లు కొత్తింటి ముత్యంరెడ్డి, పాలెం నర్సయ్య, డీసీసీ ఉపాధ్యక్షులు గడ్డం పాలెం చిన్నారెడ్డి, చిట్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు వారధిగా ఉండాలి

– ముత్యాల సునీల్ కుమార్

వేల్పూర్/మోర్తాడ్/బాల్కొండ: కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం వేల్పూర్, ముప్కాల్, మోర్తాడ్, భీంగల్ మండలాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందేవిధంగా పనిచేయాలన్నారు.అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించి సొంతింటి కలను సాకారం చేయాలన్నారు. నిజమైన లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు అందుతాయని, పేర్లు లేని కుటుంబీకుల పేర్లు చేర్పుతున్నారని చెప్పారు. మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఏకాభిప్రాయంతో మండల కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని చెప్పారు.

ప్రధాని మోదీతోనే దేశం సురక్షితం

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



ర్యాలీలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, పల్లె గంగారెడ్డి

నందిపేట్(ఆర్మూర్): పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ను సాధించుకోవడమే లక్ష్యమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించే వరకు కొనసాగుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికుల ఘన విజయం సాధించడంతో సోమవారం సాయంత్రం నందిపేట మండల కేంద్రంలోని పెద్ద మసీద్ నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు నిర్వహించిన భారీ తిరంగా ర్యాలీలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనిక శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు. పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీతోనే దేశం సురక్షితంగా ఉంటుందని, ఆయనే దేశానికి రక్షకుడని అన్నారు. నేతలు పెద్దోళ్ల గంగారెడ్డి, కంచెట్టి గంగాధర్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవనానికి లభించని మోక్షం

- విడుదల కాని నిధులు
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు



ఇరుకు గదిలో కొనసాగుతున్న సాహెబ్‌పేట్ జీపీ భవనం

వేల్పూర్: మండలంలోని సాహెబ్‌పేట్ గ్రామానికి ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ. 20 లక్షలతో మంజూరైన జీపీ భవనానికి మోక్షం లభించడం లేదు. జాన్కంపేట్ గ్రామానికి శివారు గ్రామంగా కొనసాగిన ఈ గ్రామానికి గత ప్రభుత్వ హయాంలో సొంత గ్రామ పంచాయతీ ఏర్పడింది. నాడు గ్రామానికి వీఆర్వో కార్యాలయానికి ఉన్న గదిలో గ్రామపంచాయతీని ఏర్పాటు చేశారు. మండలంలో సుమారు పదికి పైగా గ్రామాలకు దశల వారిగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఉపాధి హామీ ద్వారా నూతన జీపీ భవనాలు మంజూరు చేయగా నిర్మాణమయ్యాయి. అందులో భాగంగా మూడవ దశలో సాహెబ్‌పేట్ గ్రామానికి కూడా జీపీ భవనం మంజూరు చేయించారు. తర్వాత ఏడాదికే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఉపాధి హామీ కింద మంజూరైన జీపీ భవనాల నిర్మాణం ఆగిపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, పాత పనులకు నిధులు కేటాయించకపోవడంతో సాహెబ్‌పేట్ జీపీ భవన నిర్మాణం అటకెక్కినట్లయింది. వేయిలోపు జనాభా ఉన్న ఈ గ్రామానికి నిధులు వచ్చే మార్గం లేదు. ఉన్న తక్కువ జనాభా వల్ల వచ్చే పన్నులు పారిశుద్ధ్య నిర్వహణకు కూడా సరిపోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అంతేగాక రాష్ట్రప్రభుత్వం నుంచి వివిధ గ్రాంట్ల ద్వారా వచ్చే నిధులు కూడా రాకపోవడంతో జీపీ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారైందని ఆవేదన చెందుతున్నారు. నిధులు రాక నూతన గ్రామ పంచాయతి భవనం నెరవేరని కలగా మిగులుతోందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం చిన్న గ్రామాలపై చిన్న చూపు చూడకుండా మంజూరైన పనికి నిధులు విడుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



కొత్తగా ఏర్పడిన సాహెబ్‌పేట్ జీపీ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. చిన్న గదిలో ఎలాంటి సౌకర్యాలు లేకుండా భవనం కొనసాగుతోంది. సొంత జీపీ ఏర్పడినా పాత సమస్యలే తిరిగి వెంటాడుతున్నాయి. ప్రభుత్వం నిధులు కేటాయించి, జీపీ నిర్మాణం చేయించాలి.

– కైరి సుధాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్, సాహెబ్‌పేట్

ఆస్పత్రి స్థాయిని 30 పడకలకు పెంచాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నేతలు

రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పొతంగల్ తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు బజరంగ్ హన్మాండ్లు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ప్రస్తుతం 10 పడకల ఆస్పత్రి ఉందని, ఇది మండల ప్రజలకు సరిపోవడం లేదన్నారు. మండలంలోని 14 గ్రామాల ప్రజలతో పాటు, సమీపంలోని మహరాష్ట్ర గ్రామాల నుంచి వైద్యం కోసం పొతంగల్ వస్తారని, దీని స్థాయిని 30 పడకలకు పెంచి 24 గంటల వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. బాన్సువాడ నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ నాగం సాయిలు, మండల నాయకులు పాల్గొన్నారు.

బీరప్ప స్వామి కల్యాణోత్సవం



పాల్గొన్న బీజేపీ నేత మేడపాటి ప్రకాష్ రెడ్డి, ఇతరులు

బోధన్: సాలూర మండలం మందర్నాలో సోమవారం కురుమల ఆరాధ్య దైవం బీరప్ప కల్యాణోత్సవం ఆ కుల సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ముఖ్య అతిథిగా నుడా చైర్మన్ కేశ వేణు హాజరై మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ రావుబా గంగాధర్, హున్సా సొసైటీ చైర్మన్ మందర్న రవి, కురుమ సంఘ జిల్లా ప్రతినిధులు వీరుగొండ, దేవన్న, నర్సన్న, దేవరావు, మేడి రవి, వీరయ్య పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్ట పై గల శివాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకీసేవ చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, కొంతం మురళి పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవి ఆలయంలో..

రుద్రూర్: మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో రెండు రోజుల పాటు (సోమ, మంగళ) నిర్వహించే దేవి కల్యాణోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు దేవికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. మంగళవారం దేవి కల్యాణం, అన్నదానం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజల వద్దకే ఉపాధ్యాయులు



స్థానికులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

రెంజల్(బోధన్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు విద్యా శాఖ వినూత్న ప్రయత్నాలను చేపట్టింది. బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ఇప్పటికే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు ఉపాధి పనులు నిర్వహించే కూలీ ప్రదేశాలకు వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ బడులపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే గ్రామాల్లో జన సంచారం అధికంగా ఉండే హోటళ్లు, కిరాణా దుకాణాల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం రెంజల్ హైస్కూల్‌లో పని చేస్తున్న పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్, సోషల్ టీచర్ నాందేవ్‌లు రెంజల్‌లో ప్రధాన కూడళ్లు, ఉపాధి పని ప్రదేశాలకు వెళ్లి ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని, పాఠశాలల్లో అందించే వసతులు, సౌకర్యాల గురించి వివరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

డొంకేశ్వర్(ఆర్మూర్): దత్తాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేశారు. సీసీ డ్రైనేజీకి రూ.10లక్షలు, సీసీ రోడ్లకు రూ.12.50లక్షలు మంజూరు కాగా సోమవారం కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. అలాగే గ్రామంలో వీటి వీధి లైట్లకు రూ.1.50 లక్షలు, అంబేడ్కర్ యూత్ బిల్డింగ్‌కు రూ.3 లక్షలు, పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరైనట్లు నాయకులు తెలిపారు. మాజీ సర్పంచ్ నాగరాజు, నాయకులు భూమన్న, సుంకరి రాజు, స్రవంతి ఉన్నారు.

దుర్వినియోగం బాధ్యత కార్యదర్శులదే

బాల్కొండ: మెండోరా మండలం సావెల్ సహకార సంఘంలో దుర్వినియోగమైన రూ.97 లక్షల బాధ్యత గతంలో పని చేసిన సహకార సంఘం కార్యదర్శులదే అంటూ సహకార సంఘంలో సభ్యులైన రైతులు తీర్మానించారు. సోమవారం సహకార సంఘం వద్ద మహాజన సభను జిల్లా అధికారి అబ్దుల్ బారిక్ సమక్షంలో చైర్మన్ రాజారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సహకార సంఘంలో దుర్వినియోగంపై విచారణ అధికారి పారదర్శకంగా విచారణ చేపట్టలేదన్నారు. గత పాలకవర్గంలో చేసిన అప్పులు ప్రస్తుత పాలక వర్గం ఎలా చెల్లిస్తుందని ప్రశ్నించారు. కేవలం అప్పులు కట్టించటానికే పాలకవర్గ సభ్యులకు నోటీసులు అందించారంటూ దుయ్యబట్టారు. గత పాలక వర్గంలో జరిగిన తప్పిదాలకు వారినే బాధ్యులు చేయాలని తీర్మానించారు. ఇన్‌చార్జి కార్యదర్శి మహేశ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 16వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల ను ప్రజలు నమ్మొద్దన్నారు. బడుగుబలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. 16వ వార్డు ఇన్‌చార్జి తహసీం అహ్మద్, అబ్దుల్ మోసిన్, ఫహీం, చిట్టిరెడ్డి, బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మండల కేంద్రంలో మధ్యవర్తిత్వ కేంద్రాలు



మాట్లాడుతున్న పారా లీగల్ వలంటీర్ పద్మాసింగ్



సమావేశానికి హాజరైన మెప్మా ఆర్పీలు

బోధన్: మండల న్యాయ సేవాధికార సంస్థ నేతృత్వంలో ప్రతి మండల కేంద్రంలో మధ్యవర్తిత్వ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు సోమవారం పారా లీగల్ వలంటీర్ పద్మాసింగ్ తెలిపారు. పట్టణ కేంద్రంలోని మెప్మా కార్యాలయంలో మధ్యవర్తిత్వ కేంద్రాల ప్రాధాన్యతపై అవగాహన సమావేశం నిర్వహించారు. పద్మా సింగ్ మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం ద్వారా ఇరువర్గాల మధ్య వివాదాస్పద సమస్యలను సత్వరం షరిష్కరించుకునే ప్రక్రియ శ్రేయస్కరమన్నారు. పట్టణ కేంద్రంలోని పని చేస్తున్న మధ్యవర్తిత్వ కేంద్రం పనితీరు, ప్రాధాన్యతలను వివరించారు. మెప్మా పీఆర్‌పీ శ్రీనివాస్, మధ్యవర్తిత్వ కేంద్రం ప్రతినిధులు సుజాత, రాజేందర్ సింగ్ ,మెప్మా ఆర్‌పీలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నేతలు

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట అఖిల భారత ఐక్య రైతు వేదిక(ఏఐయూకేఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ.. యాసంగి సీజన్‌కు సంబంధించిన వడ్ల బోనస్‌ను రైతులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. నాయకులు పుట్టి నడ్పి నాగన్న, పార్వతి రాజేశ్వర్, షేక్ నసీర్, సుల్తాన్ సాయిలు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు మంచిని వెలికి తీయాలి



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న జడ్జి శ్రీదేవి

ఆర్మూర్‌టౌన్: జర్నలిస్టులు ప్రజల సమస్యలతో పాటు మంచిని వెలికి తీసి పత్రికల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. ఆర్మూర్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం నవనాథపురం ప్రెస్ క్లబ్ జర్నలిస్టులకు ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం నవనాథపురం ప్రెస్ క్లబ్‌లోని ఉత్తమ జర్నలిస్టులను న్యాయమూర్తి సన్మానించి అవార్డులను అందజేశారు. ఆ తర్వాత న్యాయమూర్తి శ్రీదేవి, ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్‌కు ప్రెస్‌క్లబ్ సభ్యులు సత్కరించారు.

కాంగ్రెస్ దాడి హేయనీయం

వేల్పూర్: సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ దాడి హేయనీయమని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు దాడికి పాల్పడితే వారిని అడ్డుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడం దుర్మార్గమన్నారు. పోలీసులతో కాంగ్రెస్ ప్రభుత్వం నియంత పాలన చేస్తోందని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లోని క్యాంప్ కార్యాలయాల్లో ఆనాటి సీఎం కేసీఆర్ ఫొటో పెట్టారా? అని ప్రశ్నించారు. మరి ఇప్పుడు మా ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డి ఫొటో ఎందుకు పెట్టాలని ప్రశ్నించారు. ఏం ప్రొటోకాల్ ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సెక్రటేరియట్‌లోని ఆయన చాంబర్‌లో ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఫొటోలు పెట్టారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతలపై దాడులు చేయాలని చూస్తే సహించేది లేదన్నారు.

నేడు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

రుద్రూర్/వేల్పూర్: పొతంగల్ మండలం కల్లూర్‌లో, వేల్పూర్ మండలం మోతెలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏవోలు నితీష, శృతి తెలిపారు. రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు వచ్చి వ్యవసాయంపై సలహాలు, సూచనలు అందజేస్తారని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 సింగిల్(తెలుగు)-10.45, 1.30, 7.45; మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-4.15, 10.30

స్క్రీన్-4 శుభం(తెలుగు)-10.50, 7.55; ఏస్(తెలుగు)-1.30, 10.35; హిట్(తెలుగు)-4.40

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సెడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,600	వెండి(కిలో)	1,02,500
22 క్యారెట్స్	90,095		

– నిజామాబాద్ బిజినెస్